రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా..

- అధ్వానంగా జంగంపల్లి – యాదగిరిగుట్ట రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని వేడుకోలు


అధ్వానంగా ఉన్న యాదగిరిగుట్ట–జంగంపల్లి రోడ్డు


రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని జంగంపల్లి – యాదగిరిగుట్ట రోడ్డంతా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. అసలే వర్షాకాలం కావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వీలు లేకుండా ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు కూడా నడపడం లేదు. దీంతో కాలేజీలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

అడుగడుగునా గుంతలే..

యాదగిరిగుట్ట మండల కేంద్రం నుంచి దాతర్‌పల్లి గ్రామాన్ని కలుపుకుని జంగంపల్లి గ్రామం వరకు 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు ఉంది. ఈ మార్గంలో జంగంపల్లి గ్రామంతో పాటుగా దాతర్‌పల్లి, లప్పానాయక్ తండా వాసులు నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, యాదగిరిగుట్ట క్షేత్రానికి ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు మార్గంలో అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బస్సులు రావడం లేదు



“యాదగిరిగుట్ట నుంచిం జంగంపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో బస్సులు కూడా గ్రామానికి రావడం లేదు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.

– కొండమడుగు భాగ్యలక్ష్మి, జంగంపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



“రోడ్డు అధ్వానంగా తయారవడంతో గ్రామం నుంచి మండల కేంద్రమైన యాదగిరిగుట్టకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో గుంతలను గుర్తించ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– మటూరి రాజయ్య, జంగంపల్లి

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

భువనగిరి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాటాల కమిటీ నాయకులు ముక్కెర్ల యాదయ్య, లక్ష్మీనర్సింహా రెడ్డి, మెతుకు సైదులు, మైలారం సత్తయ్య అన్నారు. ఉపాధ్యాయ, విద్యరంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 1న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరులో పూర్తి చేయాలన్నారు. 5571 పీఎస్ హెచ్‌ఎంల పోస్టులను మంజూరు చేసి ప్రకటించాలన్నారు. జీవో నంబర్ 317తో నష్టపోయిన ఉపాధ్యాయులను తన సొంత జిల్లాకు పంపిండచంతో పాటు విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్ భాస్కర్, జీవీ రమణారావు, కరుణాకర్, జనార్ధన్, బాలయ్య, విజయ, వెంకన్న పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న గంగిడి మనోహర్ రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. బీసీ రిజర్వేషన్ పేరుతో కాలయాపన చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తుందన్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, నాయకులు దోనూరి వీరారెడ్డి, రమణగోని శంకర్, బచ్చనగోని దేవందర్, జక్కలి రాజు, దూడల భిక్షం, దాసోజు వెంకటాచారి, భాస్కర్ నర్సింహ్మా, బండమీది కిరణ్, వెంకటేష్, సుధాకర్ రెడ్డి, నర్సింహ, బీరప్ప, వినోద్‌కుమార్, భిక్షపతి, జగత్‌కుమార్, రాములు, జవహర్, గిరిబాబు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులపై పూలు చల్లుతున్న డీఈఓ సత్యనారాయణ

- డీఈఓ సత్యనారాయణ

మోత్కూరు : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని డీఈఓ కె.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ, పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కారవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల కంటే తల్లిదండ్రుల ప్రవర్తనే విద్యార్థి భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్, తిరుమలగిరి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం దామెర శ్రీనివాస్, పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బెటి శైలజ, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, గుజ్జ సోమనర్సయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం దేవినేని అరవిందరాయుడు, కోక బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోక భిక్షం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లావ్యాప్తంగా నాగుల పంచమిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక దేవాలయాల్లో నాగ దేవత విగ్రహాలు, శివలింగాలకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు. అనంతరం నాగదేవతకు ఇష్టమైన పాలు పోసి, కోడిగుడ్డు పెట్టి పూజించారు.

– సాక్షి నెట్‌వర్క్


మోటకొండూర్: సిద్ధేశ్వరాలయంలో..


యాదగిరిగుట్టలో..


చౌటుప్పల్ : నాగ దేవత విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు


యాదగిరిగుట్ట మొదటి ఘాట్ రోడ్డు వద్ద పుట్టకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు


భూదాన్‌పోచంపల్లి : పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు


తుర్కపల్లిలో..


రాజాపేటలో..


ఆత్మకూరు(ఎం) : పుట్టకు మంగళహారతి ఇస్తున్న మహిళలు


మోత్కూరు : పెద్దమ్మతల్లి ఆలయంలో..


వలిగొండ శివాలయంలో..

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ టీం సభ్యులు

మోత్కూరు : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటి ప్రతినిధి కురుమేటి యాదయ్య అన్నారు. మోత్కూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమన్నారు. అనంతరం పాఠశాల పరిశుభ్రత, భోజన వసతి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.శారద, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటస్వామి, పాఠశాల సిబ్బంది సిహెచ్.గోవర్ధన్, వై.మల్లిఖార్జున్, జి.ప్రవీణ్, జె.కల్పన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతా రెడ్డి

తుర్కపల్లి : మండలంలోని వాసాలమర్రి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను మంగళవారం ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీరాములు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈ నరేష్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, కార్యదర్శి ఒగ్గు మధు, కరోబార్ పలుగుల ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

‘డీట్’ యాప్‌పై అవగాహన

రామన్నపేట : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు డీట్ (డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీసీ మేనేజర్ కె.రంజిత్ కుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం డీట్‌ను తీసుకొచ్చిందన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. ప్రైవేటు సంస్థల లో ఉద్యోగాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించిందన్నారు. యువత ఈ యాప్‌లో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, రవూఫ్అలీ పాల్గొన్నారు.


డీట్ యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆలేరు సీఐగా యాలాద్రి

ఆలేరు : ఆలేరు సీఐగా విధులు నిర్వహిస్తున్న కొండల్‌రావును బదిలీ చేస్తూ రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు మంగళవార ఉత్తర్వులు జారీ చేశారు. రాచకొండ కమిషరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ సీఐగా కొనసాగుతున్న యాలాద్రిని ఆలేరు సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలు భూవివాదాల్లో జోక్యం చేసుకోవడం,బహుదూర్‌పేట బాట పంచాయితీ తదితర కారణాలతో కొండల్‌రావును బదిలీ చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

మోటకొండూర్ ఎస్‌ఐ బదిలీ

మోటకొండూర్: మోటకొండూర్ ఎస్‌ఐ నాగుల ఉపేందర్ సీసీఎస్ ఎల్బీనగర్‌కు బదిలీ అయ్యారు. సీసీఎస్ ఎల్బీనగర్‌లో విధులు నిర్వహిస్తున్న డి. అశోక్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ..

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల ఎస్‌ఐ కృష్ణయ్యను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల పలు కేసుల్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో చర్యలు ఆయనను బదిలీ చేసినట్లు సమాచారం. నూతన ఎస్‌హెచ్‌ఓగా పీసీఆర్ రాచకొండలో విధులు నిర్వహించిన ఎస్. లింగయ్య నియమితులయ్యారు.

బీమగాని మల్లయ్యకు నివాళి

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో సీపీఎం నాయకులు బీమగాని మల్లయ్య గౌడ్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నరసింహులు , మాజీ సర్పంచ్ బీమగాని రాములు, శాఖ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వలిగొండ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ జలంధర్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ వసతి గృహాన్ని సందర్శించి హాస్టల్ నిద్ర చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సందెల శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ సందెల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని జూలూరు గ్రామంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో ఆగస్టు 13న నిర్వహించనున్న పింఛన్‌దారుల మహా సభను జయప్రదం చేయాలన్నారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాంకుంట్ల బస్వయ్య, వికలాంగుల హక్కుల పోరాటసమితి మండల కన్వీనర్ ఏర్పుల శివయ్య, సీనియర్ నాయకులు యాకరి నర్సింగ్‌రావు, కోట్ల నర్సింహ, కానుల భారతమ్మ, కుమార్, భాను, బాలరాజు, బాలమణి, గోపాల్, పెంటయ్య, లక్ష్మమ్మ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి

ఆత్మకూరు(ఎం): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని తపస్ క్రీడా విభాగం రాష్ట్ర కో కన్వీనర్ కొత్తకొండ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై తపస్ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు తపస్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోటకొండూర్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన గంధమల్ల గౌరమ్మ, కూనూరు దుర్గాప్రసాద్ కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఝల్లంల ఫౌండేషన్ చైర్మన్ ఝల్లంల సంజీవరెడ్డి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పడమటి రాంరెడ్డి, గంధమల్ల నర్సింహ్మ, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, మహేష్, మాధవి, బాబు, శ్రీను, వెంకటేష్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ

మోత్కూరు : మోత్కూరు సబ్ పోస్టాఫీస్‌లో ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సబ్ పోస్ట్‌మాస్టర్ రచ్చ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ పోస్టాఫీస్ పరిధిలో 9864 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఆయన వెంట బీపీఎం రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

జీలుగ సాగుతో భూసారం పెంపు

మోత్కూరు : జీలుగ సాగుతో భూసారం పెరుగుతుందని ఏఈఓ తుంగ గోపినాథ్ అన్నారు. మండలంలోని అనాజీపురం గ్రామానికి చెందిన రైతు చుక్క వెంకటయ్య తన పొలంలో సాగు చేసిన జీలుగ పచ్చి రొట్ట పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. జీలుగను పూత రాక ముందే భూమిలో కలిపి దున్నాలని తెలిపారు. జీలుగ సాసాసాగుతో భూమిలో సూక్ష్మ జీవుల ప్రక్రియ పెరుగుతుందని, మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయని భూమి ఆరోగ్యంగా మారుతుందన్నారు. ఆయన వెంట రైతు చుక్క వెంకటయ్య ఉన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో 19వ వార్డు పరిధిలో గాంధీపార్క్–చిన్నకొండూర్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వైపుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటిపై మంగళవారం ‘రోడ్డుపై మురుగు.. దుర్గంధంతో పరుగు’ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిప్ అధికారులు స్పందించారు. రోడ్డుపై గల మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి మురుగునీరు పారకుండా చేశారు.

పాఠశాలకు స్టవ్ బహూకరణ


గ్యాస్ స్టవ్ బహూకరిస్తున్న సేవా భారతి యూత్ సభ్యులు

రామన్నపేట : మండలంలోని మునిపంపుల ఉన్నత పాఠశాలకు స్థానిక సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఐరన్ గ్యాస్ స్టవ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు యూత్ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాత మన్నె పద్మారెడ్డి ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి, మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, మిర్యాల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు : విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పీఎంశ్రీ పథకానికి పాఠశాల ఎంపిక కావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలను బలోపేతానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దాసరి మంజుల, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, వెంకటేష్, పోరెడ్డిరంగయ్య, మల్లేష్,సైదులు, నరేంద్రస్వామి, మేఘ రాజు, జ్ఞానప్రసూన, రాధిక, స్వర్ణలత విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

గరుడ ఆల్వార్‌కు పంచామృతాభిషేకం


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళశారం గరుడు పంచమిని పురస్కరించుకుని ఆలయ ఆవరణంలో ఉన్న గరుడు ఆల్వార్‌కు ఆలయ అర్చకులు నవ కలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. దేవగిరి సంతోషాచార్యులు అర్చకత్వంలో గణపతి, నవగ్రహపూజల అనంతరం కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయచైర్మెన్ తూడి మురళీధర్, మాజీసర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్‌గౌడ్, శి వాలయం చైర్మెన్ వనం సత్తయ్య, మడూరి ప్రభాకర్‌రావు, కందిగట్ల జానయ్య, ఇడెం శ్రీనివాస్, గంజి రంగయ్య, మడూరి నర్సింహరావు, తాటిపాముల స్వామి, తూడి సందీప్, సంజయ్, సత్యనారాయణ, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

31న స్పాట్ అడ్మిషన్లు

రాజాపేట : మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31 స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. మెరిట్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట భర్తీకి ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశాలు పొందడానికి ఆయా సబ్జెక్టుల మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

బొమ్మలరామారం: మండలంలోని మల్యాల గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ఖాళీగా ఉన్న 10 సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి సాయి లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగష్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరై అడ్మిషన్ పొందాలన్నారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ ఏమిమా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 31వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

అడ్డగూడూరు : మండలంలోని మంగమ్మగూడెంలో సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ ,బైపీసీలో ఉన్న ఖాళీ సీట్లు కోసం ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి. విజిన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.